# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశంలో సౌర శక్తి వినియోగం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.
2. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించే రహదారులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.
3. రాష్ట్రంలో విద్యారంగ నిపుణులను ఉప కులపతులుగా నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ వెల్లడించారు.
4. తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు అక్టోబర్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.
5. ఈరోజు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

===========================

భారత దేశంలో సౌర శక్తిని వినియోగించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ లో నిన్న జరిగిన ప్రపంచ నాలుగవ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సును ఆయన ప్రారంభిస్తూ ..... 21వ శతాబ్దంలో భారత సౌర విప్లవాన్ని సువర్ణాక్షరాలతో లిఖిస్తామని ఉద్ఘాటించారు. భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ప్రధాన మంత్రి సూర్య గృహ ఉచిత విద్యుత్ పథకం'-PMSGFES విద్యుత్ వినియోగదారులకు ఒక వరం లా మారిందని తెలిపారు. ఈ పథకం కింద సౌర శక్తి ఉత్పాదన కోసం ఆర్థిక సహాయంతో పాటు ఉపకరణాల ఏర్పాటుకు ప్రభుత్వం చేయూతనిస్తోందని, తద్వారా దేశంలో ప్రతి ఇల్లు విద్యుదుత్పాదన యూనిట్ గా మారుతుందని చెప్పారు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న ఒక కోటి 30 లక్షలకు పైగా కుటుంబాలకు గానూ, 3 లక్షల 25 వేల ఇళ్లపై ఉపకరణాల ఏర్పాటు పూర్తయిందని చెప్పారు. సౌర, పవన, అణు, జల విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన శక్తి ప్రాతిపదికగా భవిష్యత్ కు రూపం ఇవ్వాలన్నది భారత దేశ లక్ష్యమని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 23న రికార్డు స్థాయిలో ఒకేరోజు 13 వేల 326 చోట్ల గ్రామ సభలు నిర్వహించారు. దీన్ని వరల్డ్ రికార్డ్స్ యూనియన్ గుర్తిస్తూ ఈ మేరకు రికార్డు ధ్రువపత్రాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. స్వపరిపాలన ఆకాంక్ష ప్రయాణంలో కొత్త మైలురాయిని చేరడం ఆనందంగా ఉందని అన్నారు. ఇందులో భాగస్వాములైన అధికారులు, స్థానిక

సంస్థలు, ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. గ్రామసభలో పాల్గొని దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగ నిపుణులను ఉప కులపతులుగా నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ వెల్లడించారు. విశ్వవిద్యాలయాల్లో సమూల మార్పులు చేయాలని నిర్ణయించామని, అందులో భాగంగా. విద్యారంగ నిపుణులను నియమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ, విద్యా నైపుణ్యాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు ఆచార్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28 చివరి తేదీ అని ఈ మేరకు మంత్రి సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించే రహదారులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలో నిన్న మంత్రి మాట్లాడుతూ, రాజధాని ప్రాంతంలో నిర్మించే 365 కిలోమీటర్ల రహదారులకు డిసెంబర్ నెలలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. రాజధానిలో శాశ్వత సచివాలయానికి గతంలో నిర్మించిన పునాదులు బలంగానే ఉన్నాయని ఐఐటీ కూడా నివేదికలు ఇచ్చాయని తెలిపారు. రాజధాని ప్రాంతంలో వాణిజ్య సంస్థలు ఏర్పాటు కావాలన్నారు. వ్యాపారం ఎక్కువ జరిగితే జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, తద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు అక్టోబర్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రేషన్‌కార్డుల జారీపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం కమిటీ నిన్న హైదరాబాద్‌లో సమావేశమైంది. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో 89 లక్షల 96 వేల రేషన్‌కార్డులు ఉన్నాయని చెప్పారు. కొత్తగా రేషన్ , ఆరోగ్యకార్డులను విడివిడిగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన తుది ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేస్తామని, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు ఇస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

హైదరాబాద్ లో వినాయక నిమజ్జన ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ – జీహెచ్‌ఎంసీ పరిధిలో 300, ట్యాంక్ బండ్ చుట్టూ 135కు పైగా క్రేన్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. నిమజ్జన ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని కోరారు. వీలైనంత వరకు ఈ రోజు రాత్రి లోపు నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

మరోవైపు ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర ఈ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. శోభాయాత్ర మార్గంలో 56 సీసీటీవీ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలో గణేష్ నిమజ్జనం

జరుగుతున్న ప్రాంతాలలో 30 చోట్ల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఆరోగ్య శిబిరాల వద్ద అంబులెన్స్‌లు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మెడికల్ కిట్లను అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామని పేర్కొంది. నిమజ్జనం కోసం 25 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

-------------------------

ఇళ్ల మధ్యలో బాణాసంచా తయారీ కేంద్రాలు నెలకొల్పితే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులచెరువులో బాణాసంచా ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో గాయపడిన క్షతగాత్రులను మంత్రి పరామర్శించి వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రమాద ఘటనలో ఏడుగురు, గాయపడ్డారని తెలిపారు. క్షతగాత్రులకు ప్రభుత్వ పరంగా పూర్తిగా వైద్య సహాయం, కోల్పోయిన గృహాలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 28 సెకన్లు)

-------------------------

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ.. హైదరాబాద్ సంస్థానంలో మాత్రం మరో 13 నెలల పాటు నిజాం పాలన సాగింది. చివరికి నాటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ నేతృత్వంలో 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వ 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. దీంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 17ను హైదరాబాద్ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌ను విముక్తి చేసిన అమరవీరులను స్మరించుకోవడానికి, యువతలో దేశభక్తి స్ఫూర్తిని నింపడమే ఈ దినోత్సవ నిర్వహణ లక్ష్యం. కాగా సెప్టెంబర్ 17ను తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా' నిర్వహిస్తోంది.

-------------------------

తెలంగాణలో 2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గుజరాత్ గాంధీనగర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఉన్న మార్గాలు.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరించారు.

-------------------------

రవాణా సౌకర్యాల ద్వారా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కె. అప్పలనాయుడు తెలిపారు. నిన్న విజయనగరం రైల్వే స్టేషన్ లో వందే భారత్ ఎక్స్ ప్రెస్ ను కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎచ్చెర్ల శాసన సభ్యులు ఎన్.ఈశ్వర రావులతో కలిసి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ రైలు ద్వారా ఆంధ్ర ప్రదేశ్ , ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాలకు లబ్ది కలుగుతుందని తెలిపారు. అలాగే విజయనగరం జిల్లా వాసులకు సౌకర్యవంతమైన రైలు అందుబాటులోకి వచ్చిందని, ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కౌలు నగదును విడుదల చేసింది. ఈ మేరకు రైతుల ఖాతాలో రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్‌డీఏ నగదును జమ చేసినట్లు అధికారులు తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణానికి భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు ఎకరానికి ఇస్తున్న వార్షిక కౌలును.. మరో ఐదేళ్ల పాటు ప్రభుత్వం పొడిగించింది. పదేళ్లపాటు కౌలు చెల్లించాలన్న గడువు ఒప్పందం ముగియడంతో మరో ఐదేళ్లు పెంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది.

======================